పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 103. అల్ అస్ర్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. ఇందులో 3 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

మక్కాలో అవతరించబడిన ఈ సూరాలో మనిషికి సాఫల్యం, ధనం వల్ల, సంతానం వల్ల, హోదావల్ల, ఆస్తిపాస్తుల వల్ల సిద్ధించదు. విశ్వాసం వల్ల, సత్కర్మల వల్ల, ఒకరి నొకరు ధర్మప్రచారాన్ని చేయడం, సహనం పాటించమని కోరటం వల్ల ప్రాప్తిస్తుంది అని ఈ సూరాలో పేర్కొనబడింది. మనిషి తన సాఫల్యం కోరుతున్నట్లయితే అన్ని పనులూ వ్యాపకాలు మానుకొని వెంటనే అన్నింటికన్నా ముందుగా విశ్వాసం వైపు శ్రద్ధచూపాలి. సదాచరణ చేయాలి. ఒకరికొకరు సత్యం మరియు సహనం పాటించమని కోరడంలో పాలుపంచుకోవాలి. లేకుంటే అతడు ఇహంలోనూ పరంలోనూ నష్టపోతాడు. ఎందుకూ పనికి రాకుండా పోతాడు. ఇక మన పరిస్థితి ఎలా ఉందంటే మనం ముందుగా ధనం వైపు శ్రద్ధ చూపుతాం. మనం అన్నింటికన్నా ముందు ప్రాపంచికత వైపు శ్రద్ధ చూపుతాం. ఇది అజ్ఞానం, మనకు నష్టం కలిగించే విషయం.

## 103. అల్ అస్ర్

**ఆయత్‌లు : 3** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) సర్వకాలాల సాక్షి! (2) నిశ్చయంగా మనిషి నష్టంలో పడి ఉన్నాడు. (3) విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండినవారు, ఒకరికొకరు సత్యంపై స్థిరంగా ఉండే, సహనం పాటించే తాకీదు చేసుకుంటూ ఉండేవారు తప్ప (వారు నష్టంలో ఉండరు).

رُكُوعُهَا 1 | سُوْرَةُ الْعَصْرِ مَكِّيَّةٌ 103 | آيَاتُهَا 3

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

وَالْعَصْرِ ﴿1﴾ اِنَّ الْاِنْسَانَ لَفِيْ خُسْرٍ ﴿2﴾

اِلَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ وَتَوَاصَوْا

بِالْحَقِّ وَتَوَاصَوْا بِالصَّبْرِ ﴿3﴾ ع 1 3 28

1 – 3 వాక్యాలు

ఇమామ్ రాజీ ఒక మహాపురుషుని మాటలను నకలు చేశారు. నేను సూరయె అస్ర్ భావాన్ని ఒక ఐస్ అమ్మేవాని నుండి గ్రహించాను. అతను బజారులో నిలబడి అరుస్తున్నాడు. పెట్టుబడి కరిగిపోతున్న వ్యక్తి పట్ల దయదల్చండి. నాపై దయచూపండి. నా ఐస్ త్వరగా కరిగిపోతోంది. మీరు త్వరగా ఖరీదు చేయకపోతే నేను నష్టపోతాను. అతడి మాటలను విని నేను సూరయె అస్ర్ భావాన్ని గ్రహించాను.

మానవుడికి లభించిన జీవిత వ్యవధి వేగంగా గడిచిపోతోంది. మంచు కరుగుతున్న విధంగా అది వేగంగా గడిచిపోతోంది. దాన్ని వ్యర్థం చేసుకుంటే లేక తప్పుడు పనులలో ఖర్చు చేసుకుంటే, అదే మానవుడికి కలిగే నష్టం. ఈనాడు మనిషికి నమాజ్ చేయడం కోసం 15 నిమిషాలు టైం లేదు. కాని ఇతర పనుల కోసం అయితే అతడికి టైం దొరుకుతుంది, ఇటువంటి జీవితం విచారకరం. కాబట్టి కాలం విలువ గుర్తించండి. మంచి పనులలో కాలాన్ని ఖర్చుచేయండి.

https://teluguislam.net/quran/